క్లుప్తంగా

అంబాపురం పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా దేవరపల్లి శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. నందిగామ మండలం అంబారుపేట గ్రామం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. అంబాపురం, జక్కంపూడి గ్రామాలకు క్లస్టర్ కార్యదర్శిగా శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. పి.నైనవరం గ్రామ గ్రేడు-5 కార్యదర్శి సంతోష్ వినోద్ కుమార్‌ను డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించినట్లు ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. పైడూరుపాడు గ్రామ పంచాయతీకి డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారిగా బి.మహేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించిందని ఈఓఆర్డీ తెలియజేశారు.

ఘనంగా సత్యసాయి సేవాసమితి వార్షికోత్సవం



పెనమలూరు: పెనమలూరులో ఆదివారం సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 63 మంది మహిళలు సామూహిక సత్యసాయి వ్రతం చేశారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ సత్యసాయి సమితి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ నాగప్రసాద్, వివిధ ప్రాంతాల కన్వీనర్లు వి.మోహన్‌రావు, బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మెండు భాస్కరరావు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కమిటీ నియామకం

పెనమలూరు: పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. సంఘం ప్రకటనలో వివరాలు తెలుపుతూ అధ్యక్షుడిగా సనత్‌నగర్‌కు చెందిన బుద్ధా లక్ష్మణకుమార్‌ను నియమించారు. జోనల్ ఆర్గనైజర్‌గా యనమలకుదురుకు చెందిన కొండవేటి రాజేష్‌బాబు, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా పరుచూరి చాముండేశ్వరిని నియమించారు. వీరి పదవీకాలం 2026వ సంవత్సరం వరకు ఉంటుంది.

తాడిగడప ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామస్వామి దేవస్థానం ఆలయ భూములు టెండర్ కం బహిరంగ కౌలువేలం పాట వేయనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ ఆలయానికి ఆర్‌ఎస్ నంబర్ 106లో 2.81 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు నిబంధనలకు లోబడి వేలంపాటలో పాల్గొనవచ్చని అన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి



నున్న(విజయవాడరూరల్): రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ సభ్యుడు, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు సూచించారు. ఆదివారం నున్న గ్రామంలో మెయిన్ ఎలిమెంటరీ స్కూల్ (కోటకట్ట సెంటర్)లో పోలింగ్ కేంద్రం ఉన్నందున దానికి 200 మీటర్ల దూరంలోపు టీడీపీ కార్యాలయం ఉందని వెంటనే దాన్ని తొలగించాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దగ్గరలో రాజకీయ పార్టీ కార్యాలయం ఉండరాదన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, ఈఓఆర్డీ శేషగిరిరావు గ్రామంలో ఉన్న రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఫ్లెక్సీ బోర్డులను తొలగించారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని ఫ్లెక్సీలను కూడా తొలగించారు. ఎన్నికల నిబంధనల గురించి ఆయా పార్టీల నాయకులతో మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని తెలిపారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధికారులు పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలను కనిపించకుండా పంచాయతీ సిబ్బంది ముసుగులు వేశారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మంత్రి జోగి రమేష్ అన్నారు. యనమలకుదురులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయడం జరిగిందన్నారు. ప్రజలంతా ఒకే తాటిపైకి వచ్చి జగన్ వైపు నిలబడి పోలింగ్ తేదీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజల మనస్సులో జగనన్న పట్ల అపూర్వమైన ఆదరణ కనబడుతోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ రాజకీయ, కులమతాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. ఎన్ని పార్టీలు కలిసిన, ఎంతమంది వచ్చిన ప్రజలు సీఎం జగన్ పక్షానే ఉన్నారని తెలిపారు. జగనన్న పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ, ప్రేమ మరువలేక పోతున్నామని అన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే చంద్రబాబును ఎవ్వరు నమ్మరని, అధికారం కోసం కాళ్లు పట్టుకుంటాడని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా మంత్రి జోగి రమేష్‌కు ఎన్నికల ప్రచారంలో అడుగడుగున ఆదరణ లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

టీడీపీకి అభ్యర్థులు కరువు..

టీడీపీ ఇప్పటి వరకు పెనమలూరుకు అభ్యర్థిని ప్రకటించలేక పోయిందని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. బాగా డబ్బు ఉన్నవాడి కోసం చంద్రబాబు సర్వేలు చేస్తూ వెతుకుతున్నారని ఆరోపించారు. జోగి రమేష్‌కు సీఎం జగనన్న ఆశీస్సులు ఉన్నాయని అన్నారు. తాను పెనమలూరుకు వచ్చింది చంద్రబాబుపై పోటీకేనని, గొట్టంగాళ్లపై పోటీ చేయడానికి కాదన్నారు. రానున్న ఎన్నికల్లో పెనమలూరులో భారీ మెజార్టీతో గెలిచి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అన్నే శ్రావన్‌కుమార్, గొడ కార్పొరేషన్ సభ్యురాలు ఈడే చాముండేశ్వరి, పార్టీ నేతలు వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయకుమార్, మరీదు శ్రీనివాసరావు, యార్లగడ్డ వీరబాబు, లంకా కోటేశ్వరరావు, అష్రఫ్, కత్తెరబాషా, కమీమ్, శ్రీనివాసరెడ్డి, లతీఫ్, కోటేశ్వరమ్మ, ఈడే గోపాలకృష్ణ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

'జంక్షన్'లో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు



హనుమాన్‌జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు, కార్యకర్తలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్ వరుసగా మూడోసారి గెలిచి రికార్డు సృష్టించడం ఖాయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా వల్లభనేని వంశీ మోహన్‌ను ప్రకటించిన నేపథ్యంలో హనుమాన్ జంక్షన్‌లో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక విజయవాడ రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను గాంధీ కట్ చేశారు. పరస్పరం స్వీట్లు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ కార్యాలయం ఎదుట యువత పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రిచంద్రశేఖర్, గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీ గెలుపు ముమ్మాటికి ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు కురిమిని శ్రీనివాసరావు, నన్నపనేని చలపతిరావు, కొమరవల్లి కిరణ్‌మూర్తి పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

గన్నవరం: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు లౌకిక శక్తులు, ప్రజాస్వామ్య వాదులు ముందుకు రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు ధారదత్తం చేశారని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వం రైతులకు కోలుకోలేని దెబ్బ తీసిందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశం ప్రమాదంలో పడిపోవడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తులో ఉన్న టీడీపీ, జనసేనను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఆర్.రఘు, కళ్లం వెంకటేశ్వరరావు, ఎం.హరిబాబు, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గన్నవరం: మండలంలో సోమవారం నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం ఎనిమిది సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 1,540 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కే రవికుమార్ తెలిపారు. దావాజిగూడెం హైస్కూల్‌లో 240, గొల్లనపల్లి హైస్కూల్‌లో 181, వెదురుపావులూరు హైస్కూల్‌లో 210, వీరపనేనిగూడెం హైస్కూల్‌లో 169 మంది విద్యార్థులను కేటాయించినట్లు చెప్పారు. గన్నవరంలోని బాలుర హైస్కూల్‌లో 270, బాలికల హైస్కూల్‌లో 189, శ్రీమల్లికార్జున హైస్కూల్‌లో 131, లిటిల్ లైట్స్ స్కూల్‌లో 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, టాయిలెట్స్, వైద్య సదుపాయలతో పాటు పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు వివరించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం బాపులపాడు మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మొత్తం 1,026 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లతో పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, ఫర్నీచర్, ఇతర వసతులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ఉంగుటూరు: మండలంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎంఈఓ-2 సాంబశివరావు తెలిపారు. తేలప్రోలు, ఆత్కూరు జెడ్పీ, గుడ్రస్, ఉంగుటూరు, మానికొండ, ఇందుపల్లి, పెద్ద అవుటపల్లి సెయింట్ జార్జీ హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 620 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ముస్లిం మైనార్టీలపై చంద్రబాబుకు అక్కసు

పెనమలూరు: ముస్లిం మైనార్టీల పట్ల చంద్రబాబు అక్కసు చూపుతున్నారని యునైటెడ్ ముస్లిం హెల్పింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాన్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన కానూరులో వివరాలు తెలుపుతూ బీజేపీతో చంద్రబాబు అంటకాగుతూ సీఏఏ, ఎన్‌ఆర్‌సీలపై ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడటం పట్ల తీవ్రంగా ఖండించారు. మహానేత వైఎస్సార్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టిన సమయంలో చంద్రబాబు నిరసనగా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందేనన్నారు. చంద్రబాబు ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూశాడని, తమ ఎదుగుదలను అడ్డుకున్నాడని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ముస్లింలు దిమ్మతిరిగే విధంగా సమాధానం చెబుతామని హెచ్చరించారు.

24న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధర్యంలో ఈ నెల 24 వ తేదీ ఆదివారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్, అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణ బంధువులు వినియోగించుకోవాలని కోరారు. పేర్లు నమోదుకు కన్వీనర్ సూర్యనారాయణ మూర్తి, 92461 93903 కో కన్వీనర్ భమిడిపాటి గణపతి 9866 936914 నంబరు సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



మంత్రి జోగి రమేష్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు

పెనమలూరు: ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. గంగూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ కానూరు సనత్‌నగర్, పోరంకి ప్రాంతాల నుంచి దాదాపు 100 మంది నేతలు, కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక పాలనతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఇతర పార్టీలో నుంచి వచ్చి వైఎస్సార్ సీపీలో చేరే వారికి న్యాయం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాపాలన అందించిన జగనన్నను తిరిగి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో సాజిత్, సలీమ్, రఫీ, జావిద్, నజీర్, పలువురు నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

సందడిగా పీవీపీ సిద్ధార్థ వార్షికోత్సవం



పీవీపీ సిద్ధార్థ కాలేజీలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి కాలేజీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన తర్వాత ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్‌ఆర్‌ఎం వైస్ చాన్స్‌లర్ మనోజ్ కే అరోరా మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. నేడు సాంకేతిక రంగంలో అనేక నూతన మార్పులు వస్తున్నందున అధ్యాపకులు కూడా నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ నాగభూషణరావు, సహాయ కార్యదర్శి లలితప్రసాద్, డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్, పాటలు పాడి సందడి చేశారు.

నిబంధనల ప్రకారమే అయోధ్యకు తాగునీటి సరఫరా

గన్నవరం: స్థానిక వీఎన్.పురం రోడ్డులో నిర్మించిన అయోధ్య ప్రాజెక్ట్‌కు నిబంధనల ప్రకారమే గన్నవరం గ్రామ పంచాయతీ నుంచి తాగునీటి సరఫరా కల్పించినట్లు ఆ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం నాని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రాజెక్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 670 ప్లాట్ల సముదాయంతో కూడిన ఈ ప్రాజెక్ట్‌లో నాలుగు బోర్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రాజెక్ట్‌లోని నివాసితులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. అయినప్పటికి కొన్ని మౌలిక సదుపాయలను గ్రామ పంచాయతీ నుంచి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగానే తాగునీటి సరఫరా నిమిత్తం పంచాయతీకి డిపాజిట్ చెల్లించినట్లు తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్‌కు వాటర్ పైపులైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాగునీటి కోసం గ్రామ పంచాయతీ పరిధిలో తమ సొంత నిధులతో ఐదు బోర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో రెండు తమ ప్రాజెక్ట్‌కు, మిగిలిన మూడు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి అవసరాలకు ఉపయోగించవచ్చని తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టే ఆలోచన లేదని, అవసరమైతే మరిన్ని బోర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామ పంచాయతీకి ఇంటి పన్ను ద్వారా గణనీయమైన ఆదాయం కూడా వస్తుందని పేర్కొన్నారు.

మద్దూరులో సుస్థిర ప్రగతి

- రూ. 2.47 కోట్లతో అభివృద్ధి పనులు
- డీబీటీ ద్వారా రూ. 17.24 కోట్ల లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా రూ. 7.23 కోట్ల లబ్ధి



మద్దూరులో నిర్మించిన సచివాలయ భవనం



కంకిపాడు: కృష్ణానది ఏటిపాయ వెంబడి ఉన్న పల్లెటూరు మద్దూరు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుస్థిరమైన ప్రగతి గ్రామంలో చోటు చేసుకుంది. అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి జాడలు కనిపిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనతో గ్రామస్తులు ఆనందంగా ఉన్నారు. సచివాలయ పరిధిలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది.

రూ. 2.47 కోట్లతో అభివృద్ధి పనులు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు అధునాతన హంగులతో కూడిన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధికి తొలి విడతలో రూ. 13 లక్షలు, రెండో విడతలో రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. పాల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి మద్దతు ధర అందించేలా బల్క్ మిల్క్ యూనిట్‌ను రూ. 20.42 లక్షలతో నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు, ఎంపీ నిధులు, మండల పరిషత్ నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలోని అనేక ప్రాంతాల్లో సిమెంటు రోడ్లను నిర్మించారు. చిన్నకట్ట రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. జల జీవన్ మిషన్ నిధులతో గ్రామస్తులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు పైపులైన్ల విస్తరణ, మురుగు సమస్య పరిష్కారానికి డ్రెయిన్ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టారు. సుమారుగా రూ. 2.47 కోట్లతో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు సమర్థంగా తీసుకుంటున్నాం. సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. ఇటీవలే మద్దూరు-ఉప్పలూరు రోడ్డు పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. రూ. 19.20 కోట్ల నిధులు కేటాయించారు. రోడ్డు అభివృద్ధి పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రయత్నిస్తాం.

చిప్పల రామదాసు,
సర్పంచ్, మద్దూరు

అభివృద్ధే లక్ష్యంగా కృషి



సచివాలయ పరిధిలో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ప్రాధాన్యత క్రమంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అభివృద్ధి విషయంలో రాజీపడటం లేదు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ సహకారంతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

వడుగు శ్రీనివాసరావు,
ఎంపీటీసీ సభ్యుడు, మద్దూరు

డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి
జగనన్న అమ్మ ఒడి	295	రూ. 1.37 కోట్లు
జగనన్న విద్యాదీవెన	176	రూ. 54.12 లక్షలు
జగనన్న వసతి దీవెన	162	రూ. 17.16 లక్షలు
వైఎస్సార్ రైతుభరోసా	393	రూ. 1.82 కోట్లు
వైఎస్సార్ పంటల బీమా	380	రూ. 2.82 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు	101	రూ. 2.95 లక్షలు
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	352	రూ. 32.39 లక్షల
వైఎస్సార్ మత్స్యకార భరోసా	17	రూ. 3.60 లక్షలు
వైఎస్సార్ పింఛను కానుక	581	రూ. 5.47 కోట్లు
వైఎస్సార్ చేయూత	290	రూ. 1.28 కోట్లు
వైఎస్సార్ ఆసరా	600	రూ. 1.48 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ(డ్వాక్రా)	711	రూ. 13.28 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	4	రూ. 1.35 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	34	రూ. 9.30 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	115	రూ. 51.71 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	77	రూ. 5.54 లక్షలు
హౌసింగ్	62	రూ. 57.84 లక్షలు
వైఎస్సార్ బీమా	15	రూ. 21.20 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	34	రూ. 10.70 లక్షలు
జగనన్న చేదోడు	21	రూ. 4.10 లక్షలు
ప్రత్యేక కోవిడ్ సాయం	907	రూ. 9.07 లక్షలు
జగనన్న తోడు(వడ్డీ)	59	రూ. 24 వేలు
మొత్తం	5,386	రూ. 17.24 కోట్లు

నాన్ డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి
ఇంటి స్థలాలు	205	రూ. 4.37 కోట్లు
జగనన్న విద్యాకానుక	204	రూ. 14.48 లక్షలు
ట్యాబ్‌లు	19	రూ. 2.51 లక్షలు
జగనన్న తోడు	81	రూ. 15.08 లక్షలు
జగనన్న గోరుముద్ద	206	రూ. 20.40 లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	46	రూ. 8.61 లక్షలు
రేషన్ కార్డులు	1031	రూ. 2.25 కోట్లు
మొత్తం	1,792	రూ. 7.23 కోట్లు